
సాక్షి ఒడిశా
శుక్రవారం । 16 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,68,058లు, వెండి 27 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఘనంగా రొజ్జొ వేడుకలు

- 8లో



పతకాల పంట

- 8లో

న్యూస్‌రీల్

బొరిగుమ్మ ఐఐసీగా జుగల్ షా



ఐఐసీకి స్వాగతం పలుకుతున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ పోలీసు అధికారిగా జుగల్ కిశోర్ షా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఓపీఎస్సీ 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన.. సుదీర్ఘకాలం సంబల్‌పూర్ జిల్లాలోనే పనిచేశారు. సంబల్‌పూర్ జిల్లా మహుళాపల్లి ఐఐసీగా ఉన్న ఆయన.. బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే ఇప్పటి వరకు బొరిగుమ్మ పోలీసు అధికారిగా పనిచేసిన క్షీరేశ్వర సాహు నువాపడ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జుగల్ కిశోర్ షాకు సిబ్బంది, బొరిగుమ్మ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు స్వాగతం పలికి, సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ బొరిగుమ్మలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. చోరీలు, అసాంఘిక కార్యకలాపాలను ప్రజల సహకారంతో అరికడతామని వివరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బిజయనారాయణ సాహు నేతృత్వంలో కార్యదర్శి ఎంపీ సుకుమార్, సలహాదారు కె.సకిల్ దొర, ఉపాధ్యక్షుడు రంజన్‌కుమార్ మిశ్రా, కోశాధికారి మానసరంజన్ హొత్తా, మానస రథ్, చింటూ పండా, శంకర మహంతి, అమిత్ ఖోస్లా, పి.అనంతరావు, బిఘ్నరాజ్ షాడంగి తదితరులు హాజరయ్యారు.


విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి



ఘుముసుర అటవీ ప్రాంతంలో ఏనుగు కళేబరం

బరంపురం: గంజాం జిల్లా ఘుముసుర రేంజ్ తారాసింగ్ అటవీ ప్రాంతంలో 11కేవీ విద్యుత్ లైన్‌ను ఢీకొనడంతో మగ ఏనుగు మృతి ఘటనపై స్థానికులు అధికారులకు గురువారం సమాచారం అందించారు. ఈ మేరకు ఘుముసురా డివిజన్ అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని, కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం బుధవారం రాత్రి సమీపంలోని అడవి నుంచి గ్రామ శివారులోకి ఏనుగుల గుంపు ప్రవేశించినట్లు తెలిపారు. ఇందులో ఒక మగ ఏనుగు అధిక సామర్థ్యంతో ఉన్న విద్యుత్ లైన్‌కు తాకడంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. నిబంధనల ప్రకారం పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

సమర యోధుడికి నివాళి



జగన్నాథ త్రిపాఠికి నివాళులర్పిస్తున్న మున్నా త్రిపాఠి

కొరాపుట్: దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు జగన్నాథ త్రిపాఠి(మున్నా) 101వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా జరిగింది. నవరంగ్‌పూర్‌లోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మనోరంజన్ త్రిపాఠి(మున్నా) కార్యాలయంలో జరిగన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర పోరాటం అనంతరం నవరంగ్‌పూర్ పురపాలక సంఘం అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల సంఘం అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మా ఘరో సంస్థ కన్వీనర్ కాదంబినీ త్రిపాఠి, ఏఐసీసీ సభ్యురాలు మానసా త్రిపాఠి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ముట్టడి

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితి కెరమటి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గ్రామస్తులు ముట్టడించారు. బీడీఓ లేకపోవడంతో నిరాస చెందిన వారంతా.. అనంతరం జీపీఓఓ సురేష్ హొత్తా, కుంద్రా ఎస్ఐ గోవింద చంద్ర హంసద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 23న బెలిబుడ గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించేందుకు కెరమటి పంచాయతీ సర్పంచ్ ఆహ్వానాలు పంపారని తెలిపారు. అయితే గత 20ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని వ్యతిరేకించి, వేరు ప్రాంతంలో నిర్వహించడాన్ని తామంతా అంగీకరించమని స్పష్టంచేశారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు.

తుది మెరుగులు..



గుండిచా యాత్రకు సిద్ధమవుతున్న మూడు రథాలు

- వార్షిక యాత్రకు సిద్ధమవుతున్న జగన్నాథుడు
- 20న రథయాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు
- చురుగ్గా రథాల అలంకరణ పనులు

పర్లాకిమిడి: ఏటా వైభవంగా జరిగే వార్షిక యాత్రకు జగన్నాథుని చతుర్థామూర్తులు, రథాలు, గొల్లభామలు, సుదర్శన చక్రాలు సన్నద్ధమవుతున్నాయి. తన తల్లి గుండిచాకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఆషాడమాసం తదియ రోజున చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రుడితో కలిసి జగన్నాథుడు రథాలపై వెళ్లారు. ఈ నేపథ్యంలోఈనెల 20న జరగనున్న రథయాత్రను ఘనంగా జరిపేందుకు అన్ని ప్రాంతాల్లోని జగన్నాథ మందిరాలు సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. పర్లాకిమిడిలో తయారు చేస్తున్న నందిఘోష్(జగన్నాథుడు), తాళధ్వజ(బలభద్ర), దేవదళన(దేవి సుభద్ర) రథాలకు గొల్లభామలు, లక్ష్మీదేవి వాహనం పిచ్చా(గుడ్లగూబ), గరుడ వాహనాలు, గజానన అవతారం వంటివి తయారు చేస్తున్నారు. రాయఘడ నుంచి వచ్చిన చిత్రకారులు బొటోకృష్ణ శొబొరో, లోకనాథ ఖండపాత్రొ స్థానిక రాజావారి ప్యాలెస్‌లో ఈ పనులు చేపడుతున్నారు. ఒకవైపు తీవ్ర వడగాలులు, ఉక్కపోత ఉన్నా సకాలంలో పనులు పూర్తి చేసి, యాత్రకు అవసరమయ్యే మూడు రథాలను తయారు చేస్తున్నారు. మొత్తం 30మంది వడ్రంగులన పనుల్లో వినియోగిస్తున్నామని రథాల శిల్పి అశోక్ మహరాణా తెలిపారు.

రూ.60 లకే ప్రసాదం..

రాయగడ: ఈనెల 20నుంచి జరగనున్న రథయాత్రకు సర్వం సిద్ధమైంది. రథం తుది మెరుగులు దిద్దుకుంటోంది. గత నెల రోజులుగా నిర్మాణ పనుల్లో నిమగ్నమైన పనివారు దాదాపు పనులను పూర్తి చేశారు. రథానికి నలువైపులా రంగులు దిద్దే పనుల్లో చిత్రకారులు నిమగ్నమయ్యారు. ఈసారి రథం నిర్మాణ పనులను స్థానికంగా ఉన్న కళాకారులు, వడ్రంగులకు అప్పగించారు. ఇదిలా ఉండగా యాత్రను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తహసీల్దార్ తపస్‌రౌత్ తెలిపారు. బంధనల ప్రకారం పూజా కార్యక్రమాల నిర్వాహణకు సంబంధించి సుమారు రూ.10 లక్షలు వెచ్చించేందుకు నిర్ణయించామన్నారు. స్థానిక దొపబంధు కూడలిలోని గుండిచా మందిరం ఇప్పటికే ముస్తాబయ్యిందని పేర్కొన్నారు. యాత్ర నుంచి గుండిచా మందిరంలో కొలువుదీరే జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతా మూర్తులను భక్తులు దర్శించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది స్వామివారి ప్రసాదం రూ.60 లకే విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో దీనిని రూ.80 లకు విక్రయించే వారని గుర్తుచేశారు. రథయాత్ర సందర్భంగా గుండిచా మందిరం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వల్ల ఆదాయం సమకూరుతున్నందున ప్రసాదం ధరలు తగ్గించినట్లు వివరించారు.

ట్రాఫిక్ మళ్లింపు..

కొరాపుట్: రథయాత్ర కోసం రథం సిద్ధం అవుతోంది. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో జగన్నాథ మందిరం ఎదుట రథ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరోవైపు రథాయాత్ర సమయంలో నవరాత్రులు దేవదేవుళ్లు ఉండే గుండిచా మందిరం కూడా మెయిన్ రోడ్డులో ఉండటంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారీ వాహనాలను మంగళ టింబర్ పరిశ్రమ మీదుగా మళ్లిస్తున్నారు.



కొరాపుట్: తుది దశకి చేరుకున్న జగన్నాథ రథం



రాయగడ: సిద్ధమైన రథం



గరుత్మంతునికి రంగులద్దుతున్న చిత్రకారుడు



రాయగడ: రథాల అలంకరణల్లో చిత్రకారులు



గొల్లభామలకు తుది మెరుగులు దిద్దుతున్న లోకనాథ ఖండపాత్రొ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పొలంలో పడి ఉన్న బాలాజీ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితి కుదుములగుమ్మ గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... కొరాపుట్ జిల్లా జయపురం కుమార్ వీధికి చెందిన బాలాజీ మొహంతొ(32) తన బైక్‌పై ఖొయిర్‌పుట్ సమితి కుదుములగుమ్మకు వెళ్తున్నాడు. అయితే ప్రమాదావశాత్తు అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో సమీపంలోని పంట పొలాల్లోకి ఎగిరి పడ్డాడు. తల, పొట్ట భాగంలో తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అటుగా వస్తున్న వారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. కుదుములగుమ్మ ఔట్‌పోస్టు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

దొంగలు దొరికారు



పోలీసులు అదుపులో బైక్ దొంగలు



బాధితుడికి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు అందిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్ది నెలలుగా చోటు చేసుకుంటున్న దొంగతనాలకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను చందిలి స్టేషన్ అధికారి జస్వంత్ హియాల్ గురువారం వెల్లడించారు. కొత్తపేట, తెరువలి ప్రాంతాల్లో తరచూ ద్విచక్ర వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు చోరీకి గురవ్వడంపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. అక్రమంగా ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్న ముఠాకు సంబంధించి వివరాలు సేకరించారు. అనంతరం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాల్లో గాలించారు. ఈ నేపథ్యంలో బాకురుగుడ ప్రాంతానికి చెందిన నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారి నుంచి బజాజ్ పల్సర్ వాహనాలు 5, హీరో గ్లామర్ 1, స్కూటీలు 3, మరో రెండు ద్విచక్ర వాహనాలు, 5సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామని ఐఐసీ వివరించారు.

సర్పంచ్ క్షమాపణ చెప్పాల్సిందే..



విధులు బహిష్కరించి, నినాదాలు చేస్తున్న పీఈఓ సంఘం నాయకులు

- విధులు బహిష్కరించిన జిల్లా పీఈఓ సంఘం

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొయిపరిగుడ పీఈఓ విధుల్లో ఉండగా తాళాలు వేసిన సర్పంచ్ సూర్యమణి నాయక్ క్షమాపణలు చెప్పేంత వరకు స్థానిక సమితిలో విధులు బహిష్కరిస్తామని పీఈఓ సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. పంచాయతీలో అభివృద్ధి పనులకు పంచాయతీ కార్యనిర్వాహక అధికారి(పీఈఓ) సహకరించడం లేదని ఆరోపిస్తూ మంగళవారం ఆయన కార్యాలయంలో ఉండగానే గదికి సర్పంచ్ తాళం విషయం తెలిసిందే. ఘటనను పీఈఓ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా పీఈఓ సంఘం అధ్యక్షుడు కృష్ణచంద్ర పాత్రొ నేతృత్వంలో బొయిపరిగుడలోని అన్ని పంచాయతీల అధికారులు బీడీఓ అభిమన్యు శత్పతిని గురువారం కలిశారు. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని స్పష్టంచేశారు. పీఈఓకు సర్పంచ్ క్షమాపణ చెప్పాలని, ప్రజాహిత పనుల్లో సర్పంచ్‌ల ప్రమేయంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



బాధితురాలు పుష్పలత

రాయగడ: పట్టణంలోని సాయి ఇంటర్‌నేషనల్ రోడ్డు సమీపంలో ఓ మహిళపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, 6తులాల బంగారు గొలుసును దోచుకు వెళ్లిన ఘటన గురువారం చోటు చేసుకుంది. దీనిపై బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాయగడ ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న కొత్తకోట పుష్పలత(56), ఆమె భర్త రామారావు రోజులాగే మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. ఇద్దరు దంపతులు ఒకరికి ఒకరు దూరంగా నడుస్తున్నారు. అదే సమయంలో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద కొందరు దుండగులు బైక్‌పై వచ్చి, పుష్పలతపై దాడి చేశారు. దీంతో ఆమె కింద పడిపోగా, మెడలోని బంగారు గొలుసుతో లాక్కొని పరారయ్యారు. అంతా రెప్పపాటులో జరిగిపోయింది. ముందుగా వెళ్తున్న తన భర్తను పిలిచే లోగా దుండగులు బైక్‌పై ఉడాయించారని బాధితురాలు వాపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఝార్ఖండ్ దంపతులకు శిశువు దత్తత



ఝార్ఖండ్ దంపతులకు చిన్నారిని అందిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లా పొష్య సంతాన కేంద్రం(నిష్నాన్ షలోం) నుంచి 39వ శిశువును కలెక్టర్ లింగరాజ్ పండా సమక్షంలో ఝార్ఖండ్‌కు చెందిన దంపతులకు దత్తత గురువారం అందజేశారు. శిశువును కొంతకాలం క్రితం కన్న తల్లిదండ్రులు వదిలి వేయడంతో పర్లాకిమిడిలోని నిష్నాన్ షలోం సంతాన కేంద్రానికి అధికారులు తరలించారు. ఈ నేపథ్యంలో ఝార్ఖండ్‌కు చెందిన దంపతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, కలెక్టర్ కార్యాలయంలో దత్తత అప్పగించారు. 8 నెలలు మగ శిశువును పొందిన దంపతులు.. ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సీడీఎం రమాంచల్ ఖమారీ, జిల్లా శిశు సురక్షా యూనిట్ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, నిస్నాన్ షలోం, కేంద్రం అధికారి ప్రత్యూష్‌కుమార్ సూజ్యో,డ డీసీపీయూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా.. నిలిచిన ట్రాఫిక్



రోడ్డుకు అడ్డంగా బోల్తాపడి ఉన్న లారీ



విశాఖ-రాయగడ మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

రాయగడ: జిల్లా కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలోని పాత్రపూర్ వద్ద ఇనుప పైపులతో విశాఖపట్నం నుంచి టికిరి వెళ్తున్న లారీ అదుపుతప్పి, బల్తా పడింది. దీంతో లారీ వెనుక భాగంలోని ఇనుప పైపులు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. అదేవిధంగా లారీ రోడ్డుకు అడ్డంగా పక్కకు ఒరిగి ఉండిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగనప్పటికీ రాయగడ మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వందలాది వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న శెశికాల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని జేసీబీ సాయంతో పక్కకు నెట్టి, రాకపోకలను కొనసాగించారు. అయితే దాదాపు 2గంటలు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

తాబేళ్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



పోలీసుల అదుపులో నిందితులు



పోలీసులు సీజ్ చేసిన తాబేళ్లు

కొరాపుట్: అక్రమంగా తరలిస్తున్న 92 తాబేళ్లను నవరంగ్‌పూర్ జిల్లా పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి అందిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీ వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశారు. మైదల్‌పూర్ ఎస్ఐ నటవర నందొ ఆధ్వర్యంలో కెందుగుడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను పరిశీలించగా, వారి నుంచి తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని కలహండి జిల్లా నుంచి నవరంగ్‌పూర్ జిల్లా జొరిగాంకు తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులు అంపానీకి చెందిన చైతన్య రౌత్, డాబుగాంకు చెందిన రాజేష్ పాయక్‌ను అరెస్ట్ చేశామని పపడాహండి ఎస్‌డీపీఓ ఆదిత్యసేన్ తెలిపారు. అనంతరం తాబేళ్లను అటవీశాఖ విభాగానికి అప్పగించారు.

కవితా సంకలనం ఆవిష్కరణ



మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు ఆశాలత



కవితా సంకలనాన్ని వివరిస్తున్న రచయిత బిచిత్రానంద బెబర్తా

పర్లాకిమిడి: రచయిత, ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా రచించిన 'కోథా-బ్యథా'(కథ-వ్యథ) కవితా సంకలనాన్ని స్థానిక ఉత్కళ హితేషిణీ సమాజ్ భవనంలో ముఖ్యఅతిథి కోస్తా ప్రవారీ పూర్ణచంద్ర మహాపాత్రొ ఆవిష్కరించారు. రచయిత బెబర్తా ఈ పుస్తకంలో తన మనోవ్యథను అనేక రకాలుగా కవితల రూపంలో తెలియజేశారని వక్తలు వివరించారు. ఆయన మరిన్ని కవితా సంకలనాలు రాయాలని ఆకాంక్షించారు. సాహితీప్రియులు డాక్టర్ భుభనేశ్వర్ పట్నాయక్, జాతీయ అవార్డు గ్రహీత ఉపాధ్యాయలు బినోద్ చంద్ర జెన్నా, సంపూర్ణానంద బెబర్తా, నర్సింగ్ గౌడొ, ఆశాలతా పాణిగ్రాహి, మహిళా కళాశాల అధ్యాపకులు డాక్టర్ కల్యాణీమిశ్రా తదితరులు పాల్గొని మాట్లాడారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు చెట్టు దగ్ధం


నేరడి-బిలో పిడుగుపాటుకు కాలిపోతున్న చింత చెట్టు

భామిని: మండలంలోని నేరడి–బిలో బుధవారం అర్ధరాత్రి పిడుగు పడడంతో భారీ చింతచెట్టు దగ్ధమైంది. సచివాలయం, ఆర్‌బీకే భవనాలకు సమీపంలోనే ఘటన జరగడంతో కొత్తూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

తోటపల్లి కాలువకు గండి


గండిపడిన ప్రాంతం

బొబ్బిలి: తోటపల్లి కుడి ప్రధాన కాలువకు మండలంలోని అలజంగి వద్ద గురువారం గండి పడింది. అలజంగి గ్రామం దాటిన తరువాత పాల్తేరు వెళ్లే దారిలో గండిపడడంతో సాగునీరు వృథా అవుతోంది. మూడు రోజుల కిందట తోటపల్లి కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఎండల తీవ్రతకు గట్టు బీటలు వారడం, మట్టి లూజు కావడంతో గండిపడినట్టు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. తోటపల్లి డీఈఈ టి.రఘునాథరావు గండి పడిన ప్రాంతాన్ని తన సిబ్బందితో సందర్శించారు. యంత్రాలతో గండిని పూడ్చే చర్యలు చేపట్టారు. శుక్రవారం నాటికి గండి పూర్తిగా పూడ్చివేసి సాగునీటి పారుదలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తామని డీఈఈ తెలిపారు.

48 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు, ముందు స్వాధీనం చేసుకున్న గంజాయి)

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి పోలీసులు జరిపిన తనిఖీల్లో 48 కిలోల గంజాయి పట్టుబడింది. సీఐ బి.వెంకటరావు స్థానిక విలేకరులకు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ వద్ద ఒడిశాలోని జైపూర్‌కు చెందిన సూరజ్‌నారాయణ్‌పాడి బ్యాగుతో అనుమానాస్పందంగా తిరుగుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. బ్యాగులో గంజాయి ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అశోక్ కుమార్, మురళి పాల్గొన్నారు.

ఉపాధిహామీ నిధులతో ఉద్యాన వనాల పెంపకం

పార్వతీపురం: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన వనాల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం గృహ నిర్మాణం, రీ సర్వే, ప్రాధాన్యతా పనుల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యానికి మించి ఉద్యానవన మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి: మండలంలోని అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు గురువారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామంలోని బట్టిగట్టువద్ద ఆయన అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఉదయాన్నే ఆహారం లేకుండా ఖాళీ కడుపుతో ఎక్కువ మోతాదులో గడ్డిమందు తాగడం వల్ల వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. ఉపసర్పంచ్ ఇద్దరు కుమారులు బ్యాంకు ఉద్యోగులు కాగా కుమార్తె అమెరికాలో నివాసముంటోంది. అయితే ఆయన ఆత్మహత్యాయత్నానికి దారితీసిన కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతం విజయనగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని డీఎస్పీ పుల్లూరు శ్రీధర్, సీఐ ఎం.నాగేశ్వర రావులు తెలిపారు.

ఆన్‌లైన్, నోటీస్ బోర్డులో పోస్టుల భర్తీ జాబితా

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని కేజీబీవీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం అభ్యర్థుల జాబితా ఆన్‌లైన్, సమగ్ర శిక్ష కార్యాలయం నోటీస్ బోర్డులో పొందుపరిచినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ బి.లింగేశ్వర రెడ్డి గురువారం తెలిపారు. అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 16లోగా జిల్లా కార్యాలయానికి తెలియజేయలని సూచించారు.


కాళ్లకు పారాణి దిద్దుకుంటున్న చిన్నారులు


చేతికి గోరింటాకు పెట్టుకుంటున్న యువతులు


ఉల్లాసంగా ఊయల ఊగుతున్న యువతి


రాయగడ: ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న యువతులు

ఘనంగా రొజ్జొ వేడుకలు

- సంప్రదాయ రీతిలో ఉల్లాసంగా గడిపిన యువతులు
- ప్రత్యేక వంటకాలతో ఆకట్టుకున్న మహిళలు

బరంపురం: రాష్ట్ర ప్రజల సంప్రదాయ పండగ రొజ్జొ వివిధ ప్రాంతాల్లో ఘనంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చిన్నారులు, పెద్దలు గురువారం సంప్రదాయ రీతిలో కాళ్లకు పారాణీ, గొరంటాకు పెట్టుకొని, కొత్తబట్టలతో ఊయాలలూగుతూ ఆనందంగా గడిపారు. అలాగే బరంపురం నగరంలో తెలుగు వారికి ఒడియా సోదరీమణులు మిఠాయిలు పంచిపెట్టి, స్నేహభావాన్ని పెంపొదించారు. రొజ్జొ సంక్రాంతి సందర్భంగా రాష్ట్రప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో థియేటర్లు కొత్త చిత్రాలతో కళకళలాడాయి. కొన్ని గ్రామాల్లో జోరుగా కోడి పందేలు జరిపారు.

జయపురంలో..

రొజ్జొ సందర్భంగా బాసుమతీ సాహిత్య సంసద్ సంస్థ ఆధ్వర్యంలో జయపురంలోని జ్యోతి కల్యాణ మండపంలో సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కనగిరి జిల్లా అదనపు కలెక్టర్ మోహణచంద్రం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యాపకులు నిర్మలా బిశ్వాల్ పాల్గొని, రొజ్జొ ప్రాధాన్యతను వివరించారు. జయపురం సంగీత సంస్థ స్వరగుంజరి కార్యాలయంలో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పలువురు మహిళలు పాల్గొని, పిండివంటలు తయారు చేసి, అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా సంగీత కచేరి ఏర్పాటు చేయగా, స్వరగుంజరి అధినేత ధీరేన్ మోహన పట్నాయక్ పర్యవేక్షణలో యువతలు మధుర గీతాలను ఆలపించి, శ్రోతలను అలరించారు. ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో మహాశివ లింగానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సంప్రదాయ పిండి వంటలతో ఆకట్టుకుంటున్న మహిళలు

సంస్కృతి మహిళ సంస్థ ఆధ్వర్యంలో..

రాయగడ: పట్టణానికి చెందిన సంస్కృతి మహిళ సంస్థ ఆధ్వర్యంలో రొజొ సంక్రాంతి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మహిళల మధ్య ముగ్గులు, మెహందీ పోటీలు నిర్వహించారు. మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా ఊయలలూగుతూ, ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సంస్థ అధ్యక్షురాలు సుజాత పాలో ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ వేడుకలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


జయపురం: ప్రత్యేక వంటకాలతో మహిళలు


రాయగడ: మెహందీ పోటీల్లో పాల్గొన్న మహిళలు


జయపురం: ప్రత్యేకంగా పూజలందుకుంటున్న గుప్తేశ్వరుడు


వేడుకల్లో పాల్గొన్న ఎంపీ చంద్రశేఖర్ సాహు, మేయర్ సంఘమిత్ర, సుభాష్ మహారాణా

జయపురం క్రీడాకారులకు పతకాల పంట



సాధించిన బంగారు పతకాలతో మీనాక్షి, బసంత



గెలుచుకున్న స్వర్ణ పతకాలతో సౌరభ పట్నాయక్

జయపురం: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో గత 3 రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జయపురం క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఇందులో ఇద్దరు అక్కాచెల్లెల్లు, తండ్రీ–కుమార్తె, కుమారుడు బంగారు పథకాలు సాధించడం విశేషం. జయపురం నువా సాహి 2వ లైన్‌కు చెందిన అక్కాచెల్లెల్లు మీనాక్షి పాణిగ్రహి(58 కిలోలు), బసంత పాణిగ్రహి(62కిలోలు) గోల్డ్ మెడల్స్ దక్కించుకున్నారు. అలాగే సారావీధికి చెందిన విశ్వనాథ్‌నాయక్, అతని కుమార్తె వైభవీ నాయక్, కుమారుడు వివేక నాయక్ వేర్వేరు విభాగాల్లో బంగారు పతకాలు గెలుచుకున్నారు. పట్టణానికి చెందిన మరో క్రీడాకారుడు సౌరభ పట్నాయక్(76 కిలోలు) రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఏడుగురు క్రీడాకారులు సత్తా చాటడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేశారు.

లారీ, స్కార్పియో ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులను 108 వాహనంలో బాడంగి సీహెచ్‌సీకి తరలిస్తున్న దృశ్యం

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న లారీని స్కార్పియో కారు ఢీ కొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకీర్‌కు చెందిన ఓ కుటుంబం స్కార్పియో కారులో విశాఖ పట్నం వెళ్తోంది. సరిగ్గా ముచ్చర్లవలస పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో అనిల్ నాగు, కైలేశ్వర్, దన్ను రాము తీవ్రగాయాలపాలయ్యారు.

పిడుగు పడి వ్యక్తికి గాయాలు

గజపతినగరం రూరల్: మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన అంపోలు అప్పలనాయుడు (60) పశువులను పొలంలోకి మేతకు తీసుకువెళ్లిన సమయమంలో బుధవారం సాయంత్రం పిడుగు పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు గజపతినగరం ఆస్పత్రికి తరలించారు.

పద్మావతినగర్‌లో చోరీ

విజయనగరం క్రైమ్:

స్థానిక రింగురోడ్డు సమీప పద్మావతినగర్ ఐదోలైన్‌లో గుర్తు దొంగలు ఓ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న నగదు, బంగారంతో పాటు బయట తాళం తీసి ఉన్న కారును కూడా దొంగిలించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పద్మావతినగర్ ఐదోలైన్‌లో నివాసం ఉంటున్న గండికోట వెంకటసాయి కృష్ణ బుధవారం రాత్రి పదిగంటల వరకూ కింద ఫ్లోర్‌లో కుటుంబ సభ్యులతో ఉన్నారు. భోజనం పూర్తయిన తర్వాత కింద గది తాళం వేసుకుని మేడపైన ఉన్న ఏసీ గదిలోకి వెళ్లి పోయారు. అయితే దుండగులు తాళాలు పగులగొట్టి గదిలోకి వెళ్లి బీరువాలో ఉన్న తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల 87 వేల నగదును చోరీ చేసి ఇంటి బయట తాళాలు తీసి ఉన్న ఆల్టో కారును పట్టుకుని ఉడాయించారు. ఉదయం లేచి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా కనిపించడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు.

కళ్లజోళ్ల షాపులో చోరీ

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో ఉన్న శ్రీసాయికళ ఆప్టికల్ షాపులో గురువారం తెల్లవారు జామున చోరీ జరిగింది. అద్దె కోసం షాపులో దాచిన కొంత నగదును తాళాలు పగులగొట్టి దొంగలు పట్టుకెళ్లిపోయారని షాపు యజమాని పాలవెల్లి లబోదిబోమంటున్నాడు. ఆకతాయిగా తిరుగుతూ చెడు అలవాట్ల బారిన పడిన వారు ఈపని చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. బాధిత యజమాని గురువారం తెల్లవారు జామున చూసేసరికి షాపు తెరిచి ఉండడంతో అవాక్కయ్యాడు. గునపంతో పాటు కొన్ని పరికరాలతో చోరీకి పాల్పడిన దొంగలు వాటిని షాపు దగ్గర విడిచిపెట్టి వెళ్లి పోయారని బాధితుడు తెలిపాడు.


చోరి జరిగిన శ్రీ సాయికళ కళ్లజోళ్ల షాపు

మన్యం సిగలో.. డిజిటల్ విప్లవం

- కొండకోనల్లో విరివిగా సెల్‌టవర్ల ఏర్పాటు
- గిరిజన ప్రజలకు తొలగనున్న సాంకేతిక సమస్యలు
- అందుబాటులోకి ప్రభుత్వ సేవలు
- నిర్మాణం పూర్తయిన టవర్లను వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- ఆనందంలో గిరిజన లోకం

గుమ్మలక్ష్మీపురం:

మొబైల్ టవర్ల ప్రారంభంతో గిరిజన గ్రామాల్లో డిజిటల్ విప్లవం వస్తుందని, ఇది గొప్ప మార్పుకు నాంది పలకనుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్మాణం పూర్తయిన మొబైల్ టవర్లను వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలం కుక్కిడి పంచాయతీ శిఖలబాయి గ్రామంలో గిరిజనులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. సాంకేతిక మార్పును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు మరింత మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. డిసెంబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సీఎం మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో విద్యా, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు తీరుస్తుండడంతో పాటు కమ్యూనికేషన్ సదుపాయం కల్పిస్తూ గిరిజనాభివృద్ధికి కట్టుబడిన ముఖ్యమంత్రిగా, ప్రతి ఆలోచన గిరిజనుల అభివృద్ధిపైనే ఉండడం సంతోషదాయకమన్నారు. ఇప్పటికే నాడు–నేడు పనులతో పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారాయన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, అనేక సంక్షేమ పథకాలు అమలుతో ప్రజలగుండెల్లో చోటుసంపాదించుకున్నారన్నారు. మీ మేలును మా గిరిజనం మరచిపోదన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ టవర్ల ఏర్పాటుతో జిల్లా వ్యాప్తంగా 4జీ కవరేజ్ వస్తుందని, జిల్లాలో నూతన శకం ప్రారంభం అవుతుందన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన 52 టవర్లకు ఒకేసారి అటవీశాఖ అనుమతులు మంజూరు చేశామన్నారు. ఒక్కో టవర్ ఏర్పాటుకు రూ.80 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలో రూ.135 కోట్ల ఖర్చుతో టవర్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. మొబైల్ వినియోగదారురాలైన గిరిజన మహిళ పాలక సంధ్య ముఖాముఖీలో ముఖ్యమంత్రితో మాట్లాడుతూ టవర్లను ఇచ్చి బయట ప్రపంచంతో గిరిజనులను పరిచయం చేశారన్నారు. సిగ్నల్స్ రాకతో ప్రపంచంతో సంబంధం ఏర్పడిందని, ఎప్పటి సమాచారం అప్పుడే తెలుస్తోందని చెప్పారు. గతంలో గర్భిణీలు ప్రసవ సమయంలో ఏమి చేయాలో తెలిసేది కాదని, అంబులెన్స్‌కు పిలుచుకు వచ్చేసరికి ప్రసవం జరిగిపోయేదని, ఇప్పుడు 108కి ఫోన్ చేయొచ్చని, ఆస్పత్రికి తీసుకెళ్లాక ప్రసవం అయితే తల్లీబిడ్డ క్షేమ సమాచారం కూడా ఫోన్లోనే తెలుసుకోవచ్చన్నారు. మారుమూల గ్రామానికి చెందిన గిరిజన మహిళనైనప్పటికీ సిగ్నల్స్ రాకతో నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం లభించడం సంతోషదాయకమని, మంచి పథకాలు ఇంకా పెట్టాలని, సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామని ఆమె ముఖ్యమంత్రితో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎంపీపీలు కుంబురుక దీనమయ్య, శెట్టి పద్మావతి, ఉపాధ్యక్షులు ఎస్.శేఖర్, జెడ్పీటీసీ సభ్యులు ఎం.రాధిక, జి.సుజాత, ఎంపీటీసీ మండంగి రమణ, సర్పంచ్ బి.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్, గిరిజనులు


మొబైల్ టవర్ల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో ముఖాముఖిగా మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, కలెక్టర్ నిషాంత్‌కుమార్


సిగ్నల్స్ వచ్చాయంటూ కుంతాంబదేవలసలో నిర్మించిన సెల్‌ఫోన్ టవర్ వద్ద ప్రజలతో కలిసి మురిసిపోతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాంకేతిక సమస్యలు దూరం

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పాచిపెంట: గిరిజన ప్రాంతాల్లో సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయడం వల్ల గిరిజన ప్రజలకు సాంకేతిక సమస్యలు తొలగుతాయని పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని కేసలి పంచాయతీ కుంతాంబదేవలసలో ఇటీవల నిర్మించిన జియో సెల్‌ఫోన్ టవర్‌ను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమరావతి నుంచి వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుంతాంబదేవలసలో నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యలతో గిరిజనులకు పథకాలు అందజేయడం కష్టమయ్యేదన్నారు. సెల్‌టవర్ల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు సక్రమంగా అందుతాయన్నారు. అనంతరం సమీపంలో ఉన్న సెల్‌ఫోన్ టవర్ వద్దకు వెళ్లి స్థానిక ప్రజలతో కలిసి ఫోన్‌చూపిస్తూ సెల్ఫీ దిగారు. వ్యవసాయశాఖ అధికారులు సమకూర్చిన విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్నాన ప్రమీల, తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ పార్వతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరనాయుడు, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

పీఓ దృష్టికి పలు సమస్యలు


మౌలిక వసతుల అవసరాన్ని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు వివరిస్తున్న ఎంపీపీ ప్రమీల

ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ దృష్టికి పాచిపెంట ఎంపీపీ బద్నాన ప్రమీల మండలంలోని పలు సమస్యలను తీసుకెళ్లారు. పద్మాపురం కూడలి నుంచి కుంతాం వరకు రోడ్డు నిర్మించాలని, కుంతాంలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని, మూలవలసలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మారక ద్రవ్యాలకు బానిస కావద్దు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: మాదక ద్రవ్యాలకు బానిసై యువత జీవితాలను చిత్తు చేసుకోవద్దని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎస్పీ బంగ్లా కూడలి నుంచి బాలాజీ జంక్షన్ స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తు బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇటీవల కాలంలో ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ కేసుల్లో నేరస్తులుగా నమోదవుతున్నారని చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన యువత డబ్బుల కోసం నేరాలకు పాల్పడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారి మెదడు మొద్దుబారి, తాము ఏమి చేస్తున్నామనే విషయాన్ని మరిచిపోయి, విచక్షణ కోల్పోయి, తల్లిదండ్రులను ఎదురిస్తూ, ప్రేమ పేరుతో బాలికల్ని వేధిస్తూ, పోక్సో కేసుల్లో నిందితులుగా మారుతున్నారని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ అనిల్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, పట్టణ సీఐలు జె.మురళీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాహితీ చైతన్యం శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ చైతన్యమూర్తి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) అని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సాహితి స్రవంతి ఆధ్వర్యంలో గురువారం మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారికి దిశ, దశ శ్రీశ్రీ అని పేర్కొన్నారు. రచయిత బాలభారతి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలనే అక్షర రూపంలో అందించిన ఘనత శ్రీశ్రీది అన్నారు. అనంతరం 40మంది కవులు స్వీయ కవితా పఠనం చేశారు. కార్యక్రమంలో కవితా స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసరావు, యూటీఎఫ్ ప్రతినిధి గిరిధర్, దాసరి రామచంద్రరావు, కుప్పిలి కామేశ్వరరావు, బీహెచ్.ఉమామహేశ్వరరావు, కె.వాసవి, కె.వి.రాజారావు, ఎర్రమ్మ, వి.రాజారావు, ఎన్.రమణారావు, వి.జి.కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-2 పోస్టుల భర్తీపై హర్షం

ఇచ్ఛాపురం: మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)-2 పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-2 ఉపాధ్యాయులతో ఈ పోస్టులను భర్తీచేయనున్నట్లు తెలిపారు. ఎంఈఓ-2 పోస్టులతో పాటు ఎంఈఓ-1 పోస్టులను ప్రభుత్వ మేనేజ్‌మెంట్ హెచ్‌ఎంల ద్వారా భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నేడు వర్సిటీలో చర్చాగోష్ఠి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రధాన సెమినార్ హాలులో మేధావుల చర్చా గోష్ఠి శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో 'రాష్ట్ర విభజన హామీలు – అమల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర' అనే అంశంపై చర్చ నిర్వహించనున్నట్లు వర్సిటీ వర్గాలు ఒకప్రకటనలో తెలిపాయి.

కళాశాలల్లో మౌలిక వసతులపై దృష్టి



ఆర్ఐఓ దుర్గారావును అభినందిస్తున్న అధికారులు, ప్రిన్సిపాళ్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ)గా ప్రగాడ దుర్గారావు బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈయన్ను ప్రభుత్వం ఆర్ఐఓగా నియమించిన నేపథ్యంలో గురువారం ఎస్.తవిటినాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లతో సమావేశమయ్యారు. డీవీఈఓ కోట ప్రకాశరావు అభినందించారు. ప్రిన్సిపాళ్లు ఎస్.తవిటినాయుడుతోపాటు బి.శ్యామ్‌సుందర్, కీర్తి తవిటినాయుడు, పీవీఎల్ నారాయణ, నారాయణస్వామి, కృష్ణవేణి, సునీత, కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్ట్ లెక్చరర్లు, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్ఐఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలను విద్యార్థులకు శతశాతం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. డీవీఈఓ ప్రకాశరావు పర్యవేక్షణలో ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లతో సమష్టిగా పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూస్తామన్నారు. అడ్మిషన్లపై దృష్టిసారించామన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



వృద్ధుడి మృతదేహం

నరసన్నపేట: మండలంలోని కంబకాయ వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధుడు గురువారం మృతి చెందినట్లు ఆమదాలవలస రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, తెల్ల బనియన్, ఎరుపు టవల్, నీలం లుంగీ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

సర్కారు లక్ష్యం
మంచి మత్స్యం





శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్ల సముదాయం

- వినియోగదారులకు నాణ్యమైన చేపలు అందేలా మత్స్యశాఖ చర్యలు
- చేపల తలసరి వినియోగాన్ని పెంచడమే లక్ష్యం
- ఇప్పటికే 276 ఫిష్ ఆంధ్ర రిటైల్ ఔట్‌లెట్ యూనిట్ల ఏర్పాటు
- పీఎంఎంఎస్‌వై కింద మరో 300 యూనిట్లు



అరసవల్లి: వినియోగదారులకు నాణ్యమైన చేపలను అందించేందుకు మత్స్యశాఖ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పలు సబ్సిడీ పథకాలను పరిచయం చేస్తోంది. స్వచ్ఛమైన, నాణ్యతతో కూడిన చేపలు, రొయ్యలు, పీతలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలలో రిటైల్ ఔట్‌లెట్స్‌ను ఏర్పాటు చేసింది. మత్స్య ఉత్పత్తుల తలసరి వినియోగాన్ని పెంచేందుకు సరికొత్త పథకాలను రూపొందించింది. నూతనంగా ఆక్వా హబ్‌లు, ఫిష్ కియోస్కులు, ఫిష్ ఆంధ్రా రిటైల్ ఔట్‌లెట్లు, లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు, ఫిష్ వెండింగ్ కమ్ ఫుడ్ కోర్టులు, ఈ-రిక్షాలు, వాల్యూ యాడెడ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. స్వయం ఉపాధి కోరుకుంటున్న వారి కోసం ప్రత్యేక రాయితీలతో పథకాలను అమలు చేయనుంది. ఇందుకోసం సమీప గ్రామ/వార్డు సచివాలయాల్లో విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్ ద్వారా దరఖాస్తులను కూడా ఆహ్వానించింది.

రాయితీతో యూనిట్లు..

ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద జిల్లాకు రూ.7.34 కోట్లతో 300 యూనిట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసే క్రమంలో జిల్లాలో లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి పథకాల అమలుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం సుమారు 13 విభాగాల యూనిట్లను సిద్ధం చేసి, బీసీ (జనరల్) కేటగిరీకి 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళా కేటగిరీలకు 60 శాతం రాయితీలను కల్పించేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలోని 11 మండలాల తీర ప్రాంతాల నుంచి వస్తున్న మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర మత్స్య శాఖ భావిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో దాదాపుగా అన్ని యూనిట్లు ఏర్పాటు చేసి లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రంలో ఒక ఆక్వా హబ్‌ను రూ.1.85 కోట్లతో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం స్థల సేకరణ పనులు జరుగుతున్నాయి.

పీఎంఎంఎస్‌వై కింద మంజూరైన యూనిట్ల వివరాలు..

యూనిట్ పేరు (సంఖ్య)	ఒక్కో యూనిట్ వ్యయం
బయో ఫ్లాక్ చెరువుల నిర్మాణం (4)	రూ.18 లక్షలు
చేప పిల్లల స్టాకింగ్ (10)	రూ. 1.25 లక్షలు
నదిముఖ ద్వారాల వద్ద కేజెస్ ఏర్పాటు(100)	రూ.5 లక్షలు
రిజర్వాయర్ల వద్ద కేజెస్ ఏర్పాటు (15)	రూ. 3లక్షలు
ఐస్ పెట్టెలతో మోటార్ సైకిళ్లు (41)	రూ. 75 వేలు
ఆక్వా క్లినిక్‌లు (01)	రూ. 35 లక్షలు
కొత్త బోట్లు, వలలు (100)	రూ. 5 లక్షలు
లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు (5)	రూ.20 లక్షలు
ఇన్సులేటెడ్ వాహనాలు (02)	రూ. 20 లక్షలు
ఈ- రిక్షాలు (10)	రూ.3 లక్షలు
రిటైల్ చేపల మార్కెట్ (హబ్) (01)	రూ.1.85 కోట్లు
చేపల దుకాణాల కియోస్కులు (10)	రూ.10 లక్షలు
వాల్యూ ఆడెడ్ ఎంటర్‌ప్రైజెస్ (01)	రూ. 50 లక్షలు

త్వరలోనే ప్రారంభం..

ఇప్పటికే జిల్లా కేంద్రంతో పాటు ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట తదితర ప్రధాన పట్టణాల్లో ఫిష్ ఆంధ్ర పేరిట రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేశారు. 75 శాతం సబ్సిడీతో సుమారు రూ.3 లక్షలతో రిటైల్ ఔట్‌లెట్లు త్వరలోనే ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఎచ్చెర్ల మండల సరిహద్దులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, అరసవల్లి మిల్లు కూడలి వద్ద, కలెక్టరేట్ రోడ్డు వద్ద ఇలాంటి ఔట్‌లెట్లు, కంటైనర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 15 వరకు వేట నిషేధం అమల్లో ఉన్న నేపథ్యంలో అనంతరం మత్స్య సంపద యూనిట్ల అమలు మరింత ఊపందుకోనుంది. ఇప్పటికే మత్స్యకార ప్రాంతాల్లోని యువత సబ్సిడీ యూనిట్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో ఉన్న విలేజీ ఫిషరీస్ అసిస్టెంట్లు (వీఎఫ్ఏ) అందుబాటులో ఉండి ఈ పథకాలపై మరింత అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రోత్సహిస్తాం..



చేపల తలసరి వినియోగం పెంచేందుకు అమలు చేస్తున్న ఈ కొత్త పథకాల అమలుకు ఆసక్తి ఉన్న అర్హులను తప్పనిసరిగా ప్రోత్సహిస్తాం. పీఎంఎంఎస్‌వై పథకంలో భాగంగా జిల్లాలో 300 యూనిట్లు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే 50 శాతం నిధులు విడుదలయ్యాయి. సచివాలయాల్లో నవశకంలో భాగంగా ఆసక్తి ఉన్న వారు ఈ పథకాల్లో లబ్ధిదారులుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చు. అలాగే జిల్లాలో ఫిష్ ఆంధ్ర రిటైల్ ఔట్‌లెట్లు సిద్ధం చేస్తున్నాం. ఇవి త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

– పి.వి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, మత్స్యశాఖ

నీట్ టాపర్‌కు ఘన స్వాగతం



తోటాడ గ్రామంలో ఘనస్వాగతం అందుకుంటున్న వరుణ్ చక్రవర్తి

పోలాకి: నీట్ యూజీ నేషనల్ టాపర్ బోర వరుణ్ చక్రవర్తికి స్వగ్రామం తోటాడలో గ్రామస్తులు గురువారం ఘన స్వాగతం పలికారు. తల్లిదండ్రులతో కలసి గ్రామానికి చేరుకున్న వరుణ్‌ను మేళతాళాలు, బాణసంచాతో సందడిగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోపాటు గ్రామస్తుల అభిమానం కూడా ఎన్నటికీ మర్చిపోనని అన్నారు. వరుణ్‌ను గ్రామస్తులతో పాటు పలువురు నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

ఉక్కబోతతో విలవిల



ఉదయం 9 గంటలకు ఖాళీగా ఉన్న లావేరు- శ్రీకాకుళం రోడ్డు

ఆమదాలవలస: జిల్లా ప్రజలు వడగాడ్పులు, ఉక్కబోతతో విలవిలలాడుతున్నారు. గత ఐదు రోజులుగా జిల్లాలో పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 43 నుంచి 44 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజలు తమ కార్యకలాపాలు కొనసాగించేందుకు వెనుకాడుతున్నారు. రాత్రి వేళల్లోనూ ఉష్ణోగ్రతలు తగ్గడం లేదని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ బి. మౌనిక తెలిపారు. మరో మూడు రోజులు ఇలాగే ఉంటుందని వివరించారు. అక్కడక్కడా మాత్రం ఒకటి రెండు జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు.

కూలిన వంతెనలోకి దూసుకెళ్లిన లారీ

- ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్, క్లీనర్
- త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



స్క్రాప్ లోడ్‌తో నదిలో ఒరిగిపోయిన లారీ

ఇచ్ఛాపురం రూరల్: కూలిపోయిన వంతెనలోకి లారీ దూసుకెళ్లిన ఘటన బుధవారం అర్ధరాత్రి ఇచ్ఛాపురం మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 3న సుమారు వంద టన్నుల బరువు గల గ్రానైట్ లారీ స్థానిక బాహుదానదిపై నుంచి వెళ్లడంతో కూలిపోయింది. అటువైపుగా ఎటువంటి వాహనాలు వెళ్లకుండా రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులతో పాటు, వాహనాలు వెళ్లకుండా ఎత్తుగా సిమెంట్ గోడ కట్టారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఒడిశాలోని చీకటి పితాతొళి నుంచి స్క్రాప్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్లేందుకు ఇదే రహదారిపై లారీను తీసుకువెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు. ప్రస్తుతం తాత్కాలికంగా వాహనాలు వెళ్లేందుకు అధికారులు కూలిన వంతెన స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు పనులు చేపడుతున్నారు. దీన్ని గమనించని డ్రైవర్ జితున్ సాహూ వంతెన దిగువన చిన్న రహదారిపై వెళ్లేందుకు ప్రయత్నించాడు. కొంచెం దూరం వెళ్లాక ముందుకు వెళ్లేందుకు ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో లారీని మళ్లీ వెనక్కి తీసుకుపోయేందుకు ప్రయత్నించడంతో అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది. వెంటనే డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై దూకేయడంతో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జరిమానా విధించారు.

ఉద్దానంలో ఈదురుగాలుల బీభత్సం



నేలకొరిగిన మునగచెట్లు

మందస : ఉద్దానంలో ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి. అంబుగాం, లింబుగాం, లొహరిబంద, గొల్లలపాలేం, కొత్తవూరు, యశోదనగర్ తదితర గ్రామాల పరిధిలో బుధవారం రాత్రి భారీ వర్షం పడింది. ఈదురు గాలులు వీయడంతో అరటి, మునగ, పనస చెట్లు పడిపోయాయి. తిత్లీ తుఫాన్ అనంతరం ఇప్పుడిప్పుడే చెట్లు పెద్దవవుతున్న తరుణంలో ఒక్కసారిగా వీచిన గాలికి నేలకొరగడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన కార్యదర్శి రాపాక శేషగిరిరావు, పార్టీ నాయకుడు సాలీన లక్ష్మీనారాయణ ఉద్దానంలో జరిగిన నష్టాన్ని గురువారం తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ శంకర్‌దాసులకు తెలియజేశారు. వీఆర్వో ఉషారాణి, హెచ్ఏ సౌమ్య పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు.

వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 17న నిర్వహించాల్సిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డాఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ పోస్టుల వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తదుపరి సమాచారం అందిస్తామని పేర్కొన్నారు.

ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు

ఆమదాలవలస: విజయవాడ డివిజన్‌లో రైల్వే ట్రాకు పనుల నిర్వహణలో భాగంగా శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ మీదుగా నడిచే పలు రైళ్లు గురువారం ఆలస్యంగా నడిచాయి. భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో సుమారు 1.20 గంటలు (గంటా ఇరవై నిమిషాలు) సమయం పాటు నిలిపివేశారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం పైకి మధ్యాహ్నం 2 గంటలకు వచ్చిన విశాఖ ఎక్స్‌ప్రెస్ 3.20 నిమిషాల వరకు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు నానా ఇక్కట్లు పడ్డారు. కొందరు ప్రయాణికులు స్టేషన్ మాస్టర్ ఎం.రవికుమార్‌ను ప్రశ్నించగా విజయవాడ స్టేషన్ సమీపంలో జరుగుతున్న ట్రాక్ పనుల కారణంగా ఈ రైలు ఇక్కడ నిలిపివేసినట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఈ నెల 21న యోగా దినోత్సవం పురస్కరించుకుని గురువారం వారోత్సవాల పోస్టర్ విడుదల చేశారు. విద్యార్థులు యోగాకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ధ్యానం వల్ల ఆరోగ్యం, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తాయన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాలు యోగా, ధ్యానం కోసం కేటాయించాలని సూచించారు. యోగా వారోత్సవాల్లో భాగంగా విద్యాపరమైన, క్రీడాంశాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యాంపస్‌లో విద్యతో పాటు యోగాకు ప్రాధాన్యమివ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పారిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

మార్పునకు 'సాక్షి'



ప్రైవేటు బడుల ముందు సీట్ల కోసం తల్లిదండ్రులు పడిగాపులు కాసే రోజులు పోయాయి. సమూలంగా మారిపోయిన సర్కారు పాఠశాలల్లో సీట్ల కోసం ఇప్పుడు లైను కడుతున్నారు. అందుకు ఈ చిత్రమే సాక్షి. ఇచ్ఛాపురం మండలం మండపల్లి ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు ఇలా క్యూ కట్టారు. బుధవారం నుంచి ప్రారంభమైన అడ్మిషన్లు రెండు రోజుల్లో ఏడు వందలకు చేరాయని ఎంఈఓ కురమాన అప్పారావు తెలిపారు.

– ఇచ్ఛాపురం రూరల్

సంస్కరణలు తీసుకొస్తే
విమర్శలు చేస్తున్నారు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రజాప్రతినిధులు

- 'జగనన్న ఆణిముత్యాలు' సత్కార సభలో మంత్రి ధర్మాన
- టెన్త్, ఇంటర్ టాపర్లకు సత్కారం, నగదు బహుమతులు అందజేత



టాపర్‌ను సత్కరించి, నగదు బహుమతులు అందజేస్తున్న మంత్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రపంచంతో పోటీపడేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం తీసుకొచ్చారని, సీబీఎస్‌ఈ సిలబస్‌ను తీసుకొస్తున్నారని.. దీన్ని హర్షించాల్సింది పోయి తప్పుబట్టే దుష్టులు, దుర్మార్గులున్న రాష్ట్రంలో మనం బతుకుతున్నామనే విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. జగనన్న ఆణిముత్యాల సత్కారాలలో భాగంగా శ్రీకాకుళం నియోజకవర్గ స్థాయి వేడుకలు గురువారం నగరంలోని బాపూజీ కళామందిరం వేదికగా నిర్వహించారు. టెన్త్‌క్లాస్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి వరుసగా రూ.15వేలు, 10వేలు, 5వేలు నగదు అందజేశారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో టాపర్‌గా నిలిచిన ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున నగదు అందించారు. మొత్తం 72 మందికి సత్కరించి నగదు బహుమతులు, ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు. వీరిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలను సత్కరించారు. అనంతరం ధర్మాన మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాల పేరిట చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో నూతనోత్సాహం, పోటీతత్వం పెరుగుతుందన్నారు. విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ బడులు, కళాశాలలపై ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు పుసుపు కుంకుమ కింద పదివేలు ఇచ్చిన చేతులు దులుపేసుకున్న చంద్రబాబు గొప్పా.. సీఎంగా ఎన్నికైన పదో రోజునే విద్యార్థుల కోసం ఆలోచన చేసి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న జగన్ గొప్పా.. అనేది ప్రజలంతా ఒకసారి ఆలోచించుకోవాలని, మంచి చేసిన ఈ ప్రభుత్వానికి మరోసారి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ విద్య అధికారులతోపాటు కళింగవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అంధవరపు సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, డాక్టర్ దానేటి శ్రీధర్, అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, గురుగుబెల్లి లోకనాథం, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ లియాఖస్ ఆలీఖాన్, ఎంఈవో జి.కృష్ణారావు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, మండవల్లి రవి, పీసీ శ్రీహరి, శ్రీకాకుళంలోని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, మున్సిపల్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా కూర్మనాథుని జయంత్యుత్సవం



స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మ క్షేత్రంలోని కూర్మనాథుని జయంత్యుత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ బహుళ ద్వాదశి సందర్భంగా ఉదయం పూజల్లో భాగంగా మూలవిరాట్‌కు వేకువజామున ప్రత్యేకంగా పంచామృతాభిషేకం జరిగింది. బాలభోగం అనంతరం స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామిలను బేడా మండపంలో ఉంచి జయంతి వేడుకల్లో విశేష ఘట్టమైన వసంత కలశాభిషేకాన్ని ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామికి శీతల నైవేద్యం సమర్పించారు. అనంతరం అనిశెట్టి మండపం వద్దకు ఉత్సవ మూర్తులను తీసుకువచ్చి ధర్మకర్త గోత్రనామాలతో ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మంటపంలో వివిధ తీర్థ జలాలు, క్షీరాభిషేకం, కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. స్నపన తిరుమంజనం సేవ నిర్వహించి ప్రధాన కలశాన్ని దేవాలయం చుట్టూ ప్రధానార్చకులు ప్రదక్షిణ నిర్వహించారు. ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలంకరణ జరిపి, కూర్మనాథుని ఆవిర్భావ చరిత్రను విన్నపం చేశారు.